# దారి

సుజాత సుబ్బుతో కలిసి మళ్ళీ వస్తోంది. వచ్చేముందు ప్రతీసారి ఫోన్‌చేసి 'సరేనా' అని అడుగుతుంది. నేను ప్రత్యేకించి 'సరే' అనాల్సిన అవసరం లేదు. తను చెప్పింది ఏదీ నేను కాదనలేనని తనకీ, నాకూ బాగా తెలుసు.

తను అలా రావటం నాకు ఇష్టమేనా? ఏమో... సుజాతంటే ఎప్పటికీ వదులుకోలేని ఇష్టమని మనసుకి తెలుసు. కానీ తను నామీదికి నెట్టేసే పనులంటేనే అయిష్టం. ఐనా చెయ్యకుండా ఉండగలనా...

'మేం వస్తున్నాం...' అని సుజాత ఎప్పుడు ఇలా ఫోన్ చేసినా, ఈ వ్యవహారానికి ఆరంభంలాంటి ఆ రోజు ఏదో రూపంలో గుర్తొస్తుంది. ఆనాడు నా మనసు పడినబాధ ఎప్పటికీ వదలదేమో.

'రవీ...' అని నన్ను, 'సుబ్బూ' అని వాడిని సమస్థాయిలో పిలుస్తుంది. ఇద్దరివేపూ ఒకేలా చూస్తుంది. అంతటి బేలన్స్ సుజాతకి ఎలా సాధ్యమో.

పదిహేనేళ్ళక్రితం... ఆరోజు అకస్మాత్తుగా నా

ఆఫీసుకొచ్చింది. కొంచెం విడిగా మేం ఇద్దరం మాట్లాడుకోవడానికి అవకాశం దొరగ్గానే చెప్పింది.

"సుబ్బూ సూటిగా, చిన్నపిల్లాడిలా అడిగేశాడు రవీ... శరీరాన్ని కాల్చేంతటి కోరిక అననుగానీ, ఏదో ఎగసిపాటు. 'సరే' అనేశాను. నా లోలోపల వున్న అసంతృప్తి కొంత కారణమేమో. ఏమైనా నిన్న ఇద్దరం కలిశాం. అయినా అది కలయిక కింద లెక్కకాదు. నువ్వే సాయం చెయ్యాలి. నీకు తెలుసుగా సుబ్బు సమర్థత. 'ఎక్కడేనా చోటు చూడు' అంటేనే భయపడి చచ్చిపోతున్నాడు. తెగించి మా ఇంటికి... ఒద్దులే నిన్ను తప్ప ఎవర్ని అడగను. ఓ గంట మాకు ఏదేనా చోటుచూసిపెట్టు..."

సుజాత చాలా తేలిగ్గా అలా చెప్పటం అయితే చెప్పిందిగానీ, అది నాలో ఇంకటానికి, ఆ నిజం నాకు వంటబట్టి, నాలో సన్నటిమంటలా వ్యాపించిన బాధని నిగ్రహించుకోవటానకి నేను పడిన యాతన ఎప్పటికీ మరుపురాదు. జరిగింది చాలదన్నట్టు వాళ్ళిద్దరికీ చోటు చూసి పెట్టాల్సిన పనొకటి.

విసుక్కున్నాను. తిట్టుకున్నాను. ఉక్రోషపడ్డాను. చివరికి చోటు చూసిపెట్టాను. అదంతా అటో... ఇటో తేల్చుకోలేని ఓ తప్పనిసరి అనుభవం. అప్పట్నుంచీ ఇప్పటివరకూ ఈ తతంగం నడుస్తూనే ఉంది. వాళ్ళిద్దరూ రేప్పొద్దున్నే మళ్ళీ వస్తున్నారు.

చేస్తున్న పనుల్లో చాలా నచ్చటంలేదు. ఇష్టమైనవి ఎన్నో ఆలోచనల్లోనే ఉండిపోతున్నాయి.

శక్తి తెచ్చుకోవాలి... 'తప్పదు' అని పనులు చెయ్యాలి. అంతే తప్ప సహజంగా పారే ప్రవాహంలాంటి ఉత్సాహం ఎంతో అరుదు. అడుగడుగునా సందేహం. ఎటూ తేల్చుకోలేని సందేహం.

నా సందేహ జీవితంలో సుజాతా భాగమే. ఇప్పుడు తనంటే నాకు కోపమా? కోరికా... ప్రేమా?

నేనూ, సుబ్బూ, సుజాతా కలిసే చదువుకున్నాం. ఒకే వీధిలో పెరిగాం. నాకన్నా రెండేళ్ళు పెద్దది సుజాత. నాకన్నా ఏడాది చిన్నవటంవల్లో ఏమో, సుబ్బూని మరీ కుర్రకుంకలా చూసేది.

ఆకతాయి అల్లరే తప్ప, ముందు జీవితం ఏంటో తెలీకుండానే కాలేజీ వరకూ వచ్చేశాం. కోరికంటే, ఆడా మగా శరీరాల ఆకర్షణంటే తెలీని వాళ్ళమేం కాదు. కానీ ఏ తొందరలేని దగ్గరతనం, చనువు. అప్పటి వాతావరణం అలాగే ఉండేది. జీవితం ఓ పద్ధతి ప్రకారంగానే నడుస్తున్నట్టు ఉండేది. మా చిన్నటౌన్ మాకు సరిపోయినట్టే ఉండేది. చదువు.... పెళ్ళి... పెద్దల అజమాయిషీ అన్నీ తీర్చిదిద్దినట్టుండేవి.

కాలేజీ మొదటి సంవత్సరమే సుజాతపెళ్ళి జరిగిపోయింది. వాళ్ళ నాన్నగారు ఎప్పుడు ఏర్పాటు చేశారో, ఎలాచేశారో తెలియనే తెలియదు. ఆ పెళ్ళి కాదనాలన్న ఆలోచనకూడా మాకెవరికీ లేదు. నేను, సుబ్బూ ఎంతో హడావిడిగా, కులాసాగా ఆ పెళ్ళిలో తిరిగాం కూడా. సుజాత భర్త ముకుందం సుజాత కన్నా పదేళ్ళు పెద్ద. పెళ్ళినాటికే ఉద్యోగం చేస్తున్నాడు. అంత కలివిడైన మనిషికాదు.

సుజాత ఎంతదూకుడో, అతను అంత నెమ్మది. డిగ్రీ పూర్తయ్యేవరకూ మాతోటే కలిసి చదువుకొంది. ఇదివరకటి చనువే. మాకేం తేడా అనిపించలేదు. పై పెచ్చు మరింత దగ్గరగా, ఇష్టంగా ఉంటూ వచ్చాం. ఎవరికి చెపుతున్నాను ఇదంతా... నాకు నేనే... ఎన్నిసార్లో... ఆ జ్ఞాపకం కదిలినప్పుడల్లా.

పెళ్ళయిన ఎన్నాళ్ళకో గుర్తులేదుకానీ... ఓరోజు అకస్మాత్తుగా సుజాత... 'ఈ వెధవ పెళ్ళేం బాగోలేదు... సంసారమూ చిరాగ్గానే ఉంది...' అంది.

నేనూ, సుబ్బూ 'తప్పు అలా అనకూడదు' అని చాలా నీతిపాఠాలు చెప్పాం. సర్దుబాటు మెళకువలూ చెప్పాం. ఏవీ పని చెయ్యలేదు.

'అసంతృప్తి... ఏం బాగోలేదు' అంటూ ఎక్కువసేపు మాతోటే ఉండేది. ఎక్కువగా సినిమాలకి వెళ్ళేవాళ్ళం. ముకుందాన్ని రమ్మన్నా మాతో వచ్చేవాడు కాదు. ఎక్కువగా ఇంటిపట్టునే ఉండేవాడు. నేనూ, సుబ్బూ కూడా ఉద్యోగాల్లో చేరాం. రోజులు అలా గడిచిగడిచి సరిగ్గా ఆరోజు నా ఆఫీసు కి వచ్చి సుబ్బుగాడి గురించి చెప్పి, అలా అంది సుజాత.

వీళ్ళిద్దరిసంబంధం... మా ముగ్గురి వ్యవహారం... ముకుందం మౌనం... పదిహేనేళ్ళు పైగానే గడచిపోయింది... సుబ్బూకీ పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. ఒక బాబు, ఓ పాప. సుజాతకి పిల్లల్లేరు.

ఉద్యోగాలు ఒక్కొక్కర్ని ఒక్కోచోట చేర్చాయి. సుజాత విజయవాడ, సుబ్బు వరంగల్, నేను హైద్రాబాద్. పిల్లలచదువులని, పెద్దవయసులో వున్న మా అమ్మా నాన్నల దగ్గర తను ఉంటే మంచిదని మా ఆవిడ ఊళ్ళోనే ఉండిపోవటంతో, ఇక్కడ ఆఫీసు వాళ్ళిచ్చిన ఈ పెద్ద ఇంట్లో ఒంటరిగా నేను...

అంతా సౌకర్యంగానే ఉంది. ఫిజికల్‌గా లోటేంలేదు. కానీ మనసులోనే. ఆ రోజుల్తో పోలిస్తే, సుజాత, సుబ్బూ వస్తున్నా ఇప్పుడు నేను శ్రమపడాల్సిందేం లేదు. వాళ్ళకక్కావల్సినవన్నీ సిద్ధంగానే ఉన్నాయి. కారుంది, డ్రైవర్ ఉన్నాడు. అనువుగా ఇల్లుంది.

అదే, ఆ రోజుల్లో ఎంతమంది చుట్టూ తిరిగానో, అలా... వాళ్ళకి చోటు కావాలని అడగటానికి ఎంత సిగ్గుపడ్డానో, ఎందరికి ఎన్నిరకాల సమాధానాలు చెప్పుకొన్నానో... కొంతమంది చాలా చులకనగా మాట్లాడటం, అవమానించటం, ప్రతిక్షణం నన్ను నేను

తిట్టుకుంటూ... అదంతా ఓ నరకం.

అయినా సుజాత ముఖం చూసీ చూడగానే ఆ యాతనంతా ఎగిరిపోయేది. ఆ అయిష్టా ప్రయాణం ఆఖర్న ఇష్టాఫలం సిద్ధించినట్టుండేది.

'సుజాత కోసంలే' అనిపించేది. ఇది స్వార్థమా? ధైర్యంగా విప్పి చెప్పుకోలేని పిరికితనమా?

సుజాత ఉన్నంత చొరవగా ఇప్పటికీ సుబ్బూ ఉండడు. ఆ రోజుల్లో అయితే మరీ సిగ్గుగా ఉండేవాడు. ఇద్దరూ కలిసిరావటం ఆలస్యం, పొడి మాటలతో నన్ను పలకరించి, కొద్ది నిముషాలల్లోనే నన్ను వదిలేసి లోపలికి వెళ్ళిపోయేవాళ్ళు. వాళ్ళకి నేను ఏర్పాటుచేసి పెట్టిన ఏకాంతంకన్నా, నా ఏకాంతమే నన్ను ఎక్కువ బాధించేది. నా ఎదురుగావున్న కొద్ది క్షణాలు కూడా సుబ్బూ, సుజాత ఒకర్నొకరు విడవకుండా చూసుకుంటూనే ఉండేవారు.

ఒకరి శరీరం మరొకరికి తెలీనట్టు అస్తమానం ముట్టుకుంటూనే ఉండేవారు. ఇప్పుడు అలాకాదు. రాగానే ఇద్దరూ అవకాశంకోసం ఎదురుచూస్తారు. ముందుగా మాట్లాడాలని, తమ తమ గొడవ నాతో చెప్పుకోవాలని... ఒకరిమీద మరొకరికి కంప్లయింట్స్... ఎడతెగని దెబ్బలాటలు.

ఇప్పటికేనా వీళ్ళిద్దరూ నన్నొదిలేస్తే బావుణ్ణనిపిస్తుంది. వాళ్ళు వదలరు. వాళ్ళేకాదు వాళ్ళని నేనూ వదులుకోలేను. వస్తూనే వాదప్రతివాదాలతో వేడెక్కి వస్తారు. ఆ వేడితోనే నా దగ్గరికి చేరతారు. ఇద్దరూ చాలాసార్లు చాలాచాలా చెప్పారు.

ఇద్దరి వాదనా సరైందే అనిపిస్తుంది. ఎవరినీ సమర్థించలేని పరిస్థితి. ఎవరినీ కాదనలేని వ్యవహారం. పోనీ మౌనంగా ఉండిపోదామంటే ఉండనివ్వరు. భీకరంగా పిల్లుల్లా దెబ్బలాడుకుంటారు. మరో అరగంటలో ప్రాణసమానంగా కలిసిపోతారు. వాళ్ళని చూస్తే బాధగానూ, ఆనందంగానూ ఉంటుంది. కానీ సంతృప్తిగా మాత్రం ఉండదు.

మేం హైస్కూలు చదువునుంచి కాలేజీకి మారి, డిగ్రీ పూర్తి చెయ్యటానికిమధ్య గడిచిన అయిదారేళ్ళ కాలంలో, చాపకింద నీరులా జరిగిన మార్పులేవో... మాకు తెలియకుండానే మా జీవితాల్ని లోబరుచుకొన్నాయేమో అనిపిస్తుంది.

తనకి ఏదినచ్చినా, నచ్చకపోయినా కరాఖండీగా తెగేసి చెప్పటం సుజాతకి అలవాటు. తన పెళ్ళి గురించి... 'ఈ వెధవ పెళ్ళి బాగోలేదు' అని అలాగే చెప్పిందనుకొన్నాం. సుజాతలోని ఆ స్వతంత్రగుణం మాకు ఎంతో ఇష్టంగా ఉండేది. ఆ స్వతంత్రం ఎప్పుడు స్వేచ్ఛగా మారిందో మాత్రం మాకు తెలియకుండానే జరిగిపోయింది.

మాముగ్గురి పెళ్ళిళ్ళు మాకు తెలిసే జరిగాయి. చాటుమాటుగానో, బలవంతంగానో, అకస్మాత్తుగానో జరిగినవి కావు. మా పెళ్ళిళ్ళు జరిగినప్పుడు

దంపతులం హాయిగా ఉండాలని మనస్ఫూర్తిగానే కోరుకున్నాం. మా లోలోపల కోరిక వున్నా పెళ్ళిళ్ళు చేసుకుని స్థిరపడ్డమే సబబు అనుకున్నాం. మనసులన్నీ చాలా తేటగానే ఉన్నాయి.

అప్పటివరకూ అంతా సవ్యంగా, చక్కగా వున్న జీవితం ఇలా... ఎలా గందరగోళం పాలైందో? జీవితం బావుంది అనుకొనే పద్ధతి నుంచి, బాగోలేదనుకోవటం అప్ర యత్నంగా జరిగినట్టు కనబడినా, దాని వెనక ఏ బలం లేకుండా జరగలేదు. గుర్తుగా తెలియకుండానే జరిగిన మార్పు- మా కోరికలు, మా టౌన్ మాకు సరిపోవటం మానేశాయి.

మేం ఓ పద్ధతిని, ఓ హద్దుని దాటేశాం. అంతేకాదు చాలా విషయాలు తప్పుగా అనిపించటం మానేశాయి. సుబ్బూ, సుజాతని కోరుకోవటం, ఆమె అవుననటం. వాళ్ళిద్దరికీ కాకపోయినా, నాక్కూడా తప్పనిపించలేదు. నడుస్తున్నది ఎటో తెలియక పోయినా, ఎక్కడికి చేరతామో తెలియకపోయినా, నడిచేశాం. మమ్మల్ని మేం సరిపెట్టుకోవటం... ఇలాంటి జీవితాలు ఇంకా చాలా ఉన్నాయిలే అని తృప్తి పడటం మాకు తెలియకుండానే మాలోకి చేరాయి.

సుబ్బూ సుజాతలమీద నాకు అసూయా ఉంది. ప్రేమా ఉంది. ఏది ఎక్కువో, తక్కువో తెలుసుకోవటానికి భయం. వాళ్ళిద్దరూ కలిశారు. కలిసిన వాళ్ళు కలకాలం హాయిగా ఉండాలని నా కోరిక.

వాళ్ళ గొడవలంటే ఎంత చిరాకో, వాళ్ళమధ్య ఉన్న దగ్గరితనం అంటే అంతకన్నా ఇష్టం. వాళ్ళిద్దరి మధ్యా ఉన్న ఇష్టమేమిటో నాకు తెలుసు. సుబ్బూ ప్రసక్తి వచ్చినప్పుడు సుజాతే చెప్పిందోసారి.

“సుబ్బూ నా దగ్గరగా ఉన్నప్పుడు... పసిపిల్లాడిలా... తనకంటూ ఏదీలేని వ్యక్తిలా... నాలోకి ఒదిగిపోతాడు. అటువంటివాడికి నేను అందించగలుగుతున్నానన్న తృప్తి... ఒక స్త్రీగా, తనకన్నా పెద్దదానిగా, నేను తనకి ఇస్తున్నానే... అది మాటల్లో చెప్పలేనిది రవీ... తల్లిగా... పిల్లలులేని నాకు అదో ఊరడింపు. ఈ బంధంకోసం సుబ్బూకి ఇలా నన్ను నేను ఇచ్చుకోవటం కోసం... దేన్నైనా ఎదిరిస్తాను...

సుబ్బులా ముకుందం నా దగ్గరేం తీసుకోలేదు. అతనికి ఆ పద్ధతి ఎలా వచ్చిందో... తుడుపులూ, కొట్టివేతలూ లేని జాగ్రత్తైన బేలన్స్ షీట్‌లా... ఎప్పటినుంచో స్థిరమైపోయిన విధానంలాంటి జీవితం... ‘నేను చెప్పినట్టు విను. అది చాలు. నీ దగ్గరనుంచి అంతకన్నా ఏంవద్దు’ అన్నట్టుంటాడు.

నేను ఎలా ఉన్నానో అలా ముకుందానికి అఖ్ఖర్లేదు. అతనికి కావాల్సినట్టు మారి... నిర్జీవంగానైనా సరే నేను ప్రవర్తించగలిగితే అతనికి కావాలి.

సుబ్బా అలాకాదు 'నువ్వు నాక్కావాలి. నీ ఆధారం నాకు అవసరం...' అని నన్ను కోరుకొన్నాడు. నేను అందించేది ఏదైనా అతనికి ఇష్టమే. ఆ ఇష్టమే సుబ్బాలో నేను ఫీలయ్యే ప్రత్యేకత.

ఆ ప్రత్యేకతలోని మా కామన... కొత్తదనం, ఉద్వేగం నాకు సరైన జీవితంలా ఉంది. అది ఒదులుకోలేను. ముకుందంనుంచి విడిపోవటానికి నేను ఎప్పుడూ సిద్ధమే. నా మనసంతా వివరంగా చెప్పి విడిపోదామని... చాలాసార్లు అడిగాను.

ఒప్పుకోలేదు. మర్యాద లోపమనో... లేదా ఇలా ఇదంతా భరించటం అతనికి గొప్పగా ఉందో... ఏమయినా ముకుందం పద్ధతి మారదు. మా సంసారంలో ప్రత్యేకతేం లేదు సరికదా... ఇష్టం కూడాలేదు. ఓ పద్ధతిగా జరిగే తంతులాంటి ఆ జీవితమే అసంతృప్తి...

ముకుందం నన్ను వదలడు. అతను ఒప్పుకొంటే తప్ప అతన్నించి విడిపోవటానికి నాకు మనసురావటంలేదు. అందుకే నేనేం దిగులు పెట్టుకోదలుచుకోలేదు. సుబ్బా నాకన్నా చిన్నవాడన్న విసుర్లూ... అదేదో ప్రత్యేకమైన తప్పు అన్నట్టు నానా మాటలూ విన్నాను. నాకు ఆ బాధకూడా లేదు. పై పెచ్చు తనకన్నా పెద్దదాన్నవటమే నాకు బావుంది"

సుజాతలో అదే ధైర్యం.

ఏటికి ఎదురీదుతున్న వీరి బంధం... ఒకరికోసం ఒకరు ఇమిడిపోగలగటం ఎలా కాదనగలనూ... అంత హాయిగా, అంత దగ్గరగా ఉండే వీరి సంబంధంలో ఇప్పుడీ గొడవలేమిటో? ఘర్షణలేమిటో?

అసలు గొడవేమిటో స్పష్టంగా చెప్పమని ఇద్దర్నీ విడివిడిగా రెండుమూడుసార్లు అడిగాను. సుజాత తీవ్రస్థాయిలో చెప్పింది. సుబ్బా తన ధోరణిలో నెమ్మదిగా, వివరిస్తూ చెప్పాడు. అయినా ఎటూ తేలేలా విషయం కనపట్టంలేదు. అంతా గందరగోళం...

అసలు నేనేమిటి? నా మనస్థితి ఏమిటి? దీనికి సుజాత చెప్పిన మాటలే గుర్తొస్తాయి.

"నీ విషయం నాకు తెలుసు రవీ... నేనంటే నీకు ఇష్టం. నా గురించి నువ్వు ఎంత కష్టమైనా పడతావు. అలా అని నీకోసం నువ్వేం చేసుకోలేవు. అదే నీలోవున్న అసంతృప్తి. ఇప్పుడసలేం చెయ్యలేవు. నీ భార్యా, పిల్లలు... ఆ బంధంలో... నీతి, మంచితనం నువ్వు హాయైన బందీవి. అప్పుడప్పుడు మాత్రం ఏదో పొందాలన్న తాపత్రయంలో ఉద్వేగపడతావు. నిన్ను ఉపయోగించుకొంటున్నానని తెలుసు. అయినా నాకేం గిల్టీగా లేదు. ఇలా కాకపోతే, నేనీ మాత్రం చనువుగా ఉండలేకపోతే మనది స్నేహమేకాదు. ఇదంతా నా వేపునుంచి స్వార్థంగా కనిపిస్తుంది. కానీ అసలు నిజం నీవేపు నుంచి చొరవలేకపోవటం"

'నిజమేనేమో...'

సుబ్బాకి అన్ని విషయాలు నెమ్మదే. భార్యా పిల్లలు కావాలి. సుజాతా కావాలి. నేనూ కావాలి. అన్నీ సౌమ్యంగా ఉండాలి. ఎవరూ భాధపడకూడదు. చివరికి ముకుందం కూడా. దీనికి తోడు ఇప్పుడు సుజాత లేవనెత్తిన సమస్య అగ్నికి ఆజ్యంగా ఉంది. సుజాత చాలా ఆవేశంగా, తీవ్రంగా చేసే నిందారోపణ, సుబ్బా పిరికితనం గురించి, అంతకన్నా అతనిలో నిజం కరువయ్యింది అంటుంది.

"నేను నా భర్తకి అన్నీ చెప్పాను. సుబ్బా ఎప్పుడు రమ్మంటే అప్పుడు వస్తాను. ఎవరిముందో పలచనవుతానని, అవమానపడతాననీ ఎప్పుడూ ఏ క్షణం ఆలోచించలేదు. దీనికి పూర్తి తేడాగా సుబ్బాకి అన్నీ అభ్యంతరాలే, తనంతగా తను నన్ను రమ్మనడు... పదిమంది కళ్ళల్లో మనం పడకూడదంటాడు. తన భార్యకి తెలుస్తుందేమోనన్న భయం...

రేపొద్దున్న పిల్లలు పెద్దయ్యాక వాళ్ళేమనుకొంటారోనని ఇప్పట్నించే బెంగ... ఇదేం చేతకానితనం.ఆడదాన్ని నాకున్న ధైర్యంలో పదోవంతు లేకపోతే, తనకి నామీద ఉన్నదేమిటి? అది అభిమానం అనీ, ప్రేమ అనీ ఎలా అనుకోను. గిల్టీగా లేకుండా, స్వేచ్ఛగా ఉండాలనేకదా ఈబంధం. వాడికి చెప్పు..." అంటుంది.

"సుజాతకి మొదటినుంచీ ధైర్యం, తెగింపు ఎక్కువే. నేను మొదటినుంచీ మెతక అని మీ ఇద్దరికీ తెలుసు. తను తెగించి భర్తతో చెప్పింది. అతను ఎందుకో మౌనం వహించాడు. అలా అని నన్ను అన్నీ ఇంట్లోచెప్పి గొడవలు పెట్టుకోమంటే ఎలా? పిల్లలు ముఖ్యంకాదు, మన గొడవే ముఖ్యం అంటే ఎలా? అర్థంచేసుకోమంటే అర్థం చేసుకోదు.

అంతకీ ఎంతగానో బతిమాలుతున్నాను. ఏదీ దాచకుండా చెపుతున్నాను. తెలిసీ తెలిసీ కుటుంబంలో గొడవలు పెట్టుకోవటం సబబు కాదంటే వినదు. వీలున్నంత వరకూ తను చెప్పినట్టే చేస్తున్నాను. ఎప్పుడో నూటికి ఒకటి, రెండుసార్లు కుదరటంలేదు. ఆ మాత్రం ఓపిగ్గా సుజాత సర్దుకోకపోతే ఎలా... అంతకీ మధ్యలో నువ్వుండి, నానా నరకం అనుభవిస్తూ మమ్మల్ని కాపాడుతున్నావు. అదీ అర్థం చేసుకోదు..." ఇదీ సుబ్బా ధోరణి.

'మీ ఇద్దరి గొడవా తేలేది కాదు...' అని నేను తప్పుకోనా!... అది ధర్మమేనా? దూరంగా ఉండలేక, దగ్గరగా ఉండి ఎటూ తేల్చలేక, ముఖ్యంగా సుజాత ప్రభావంలో గిలగిలలాడుతూ, నీతి అవినీతి అన్న మాటలకే భయపడుతూ, సందిగ్ధంలో కాలిపోతూ ఇలా మథనపడటం నా వరకేనా సరైందేనా?

ఎందుకిలా జరుగుతోంది? అందరూ మంచివాళ్ళే... అందరి మనసులూ సరైనవే... ఒక్కమాటలో ఈ గొడవంతా కొట్టిపారెయ్యొచ్చు. 'మంచీ, చెడూ ఆలోచించక, ఒళ్ళు అదుపులో లేకుండా ప్రవర్తిస్తే ఇంతే...' అని. కానీ అది నిజమా? కాదు.

మంచీ, చెడూ ఆలోచన ఇప్పటికే పోలేదు. శరీరం పరిధినీ, ప్రాముఖ్యతనీ మరిచిపోయి, విలువలేని దొల్లుడికే అంకితం అయిపోయిందీ లేదు.

అవినీతిలా కనిపించే ఈ ఊబిలో, మనసులకి సంబంధించిన ఓ నీతిపోరు ఉంది. నేను సుజాతని కావాలని అడిగిపొందినా, సుబ్బా సుజాతని నోర్మూసుకొని పడిఉండమన్నా, సుజాత మా ఇద్దర్నించీ, ముకుందం నుంచీ దూరంగా వెళ్ళిపోయినా అసలు బాధేలేదేవో... కానీ ఈ ఆలోచనలే అనారోగ్యకరంగా, అవినీతిగా అనిపిస్తున్నాయి.

బావుండాల్సిన అనుభవాలు బావుండకుండా, బాధ కలిగించేలా ఎందుకిలా మారుతున్నాయి. ఏం చెయ్యాలి? అలా అని సుజాత, సుబ్బాల సంబంధం సమర్థనీయం అని కాదు... ఇలా జరగకుండా ఉండాల్సింది... జరిగిపోయింది... ఇప్పుడేమిటి? సందిగ్ధకాలం ఇది... మా ముగ్గురి విషయంలోనే కాదు... నాకు చాలా విషయాల్లో ఇలాంటి సందేహాలే కలుగుతున్నాయి. ఏది మంచి, ఏది చెడు?

నాకు తెలిసినకాలంలోనే, నాజీవితంలోనే చాలా విషయాలు మారిపోయాయి. నా చిన్నతనంలో ఎవరేనా తాగుతున్నారంటే పెద్ద తప్పు. ఈనాడు అంత తప్పుకాదు. పరాయి సంబంధాలు తప్పులు చీకటి చాటునే ఉండేవి. అలాగే ఉంచాలని తాపత్రయ పడేవారు. ఇప్పుడు మనసు ఇష్టపడని సంబంధం ప్రతీదీ తప్పులాగే పోరాటం జరుగుతున్నకాలం. జీవనావసరాల విషయంలోనూ మార్పువచ్చింది. అది స్పష్టంగా అందరికీ కన్పిస్తోంది. కానీ అంతరంగాల్లో వచ్చిన మార్పు ఎందరికి తెలుస్తోంది?

గతంలోలా.. స్థిరంగా ఇది మంచిది... ఈ పద్ధతిలో జీవిస్తే ప్రశాంతంగా ఉంటుంది... అని చెప్పుకోగలిగే అవకాశం కనుమరుగైంది.సుజాత ఫోన్‌చేసిన ప్రతీసారీ మనసు ఉద్విగ్నపడుతుంది. చిరాకు పడతాను. సుబ్బా అంటే జాలేస్తుంది. ముకుందం విషయంగా అయితే ఏ ఆలోచనా సాగదు.

xxx

నిన్నటి నుంచీ రకరకాల లోచనలు. ఒకదానికీ మరొకదానికీ పొంతనలేదు. ఎక్కడినుంచో... ఎక్కడికో... పూర్తిగా సంబంధంలేని ఆలోచనలా? కాదు... ముక్కలు ముక్కలుగా ఉన్నా ఏదో అస్పష్టమైన ఆధారంతోటే సాగుతున్నాయి.

ఏ క్షణంలోనైనా వాళ్ళు రావచ్చు... వాళ్ళకోసమని డ్రైవర్ స్టేషన్‌కి వెళ్లాడు. వీళ్ళు ఇలారావటం... వెళ్ళటం... ఈ సమయంలో మిగిలినవేవీ నాకు రుచించకుండా బుర్రపాడుచేసుకోవటం... ఇంతేనా... ఇలా జరుగుతూ ఉండాల్సిందేనా?

ఆ రోజుల్లో సుజాత, నేనూ, సుబ్బా పోట్లాడుకొన్నా ఎంతబావుండేది. పైపైన ఏం జరిగినా మనసుస్థాయి హాయిగా ఉంటూ... ఎంతో నమ్మకంగా ఉండేది జీవితం.

అలా ఉండగలిగాం అంటే చిన్నతనపు అమాయకత్వమా? ఊహూ... కేవలం అదేకాదు.

చాలా వాటిమీద... చాలామందిమీద నమ్మకం. అమ్మానాన్న మీద... ఇరుగుపొరుగుమీద... పెద్దవాళ్ళ మాటలమీద... ఇప్పుడు దేనిమీదేనా గట్టి నమ్మకం. ఎవరికేనా ఉందా? మనసులో ఒకటి... బైటకొకటి...

ఎప్పుడో నేనెరుగని గతంలోకాదు... హైస్కూలు రోజుల్లో... చైల్డ్ ఎబ్యూజ్ అంటే ఎరుగని పల్లెలు, టౌన్స్... వయసొచ్చిన ఆడపిల్లలంటే అపురూపమైన అందం... అటువేపు చూడటమే హాయైన అనుభూతిలా ఫీలయ్యే అబ్బాయిలు... 'ఛ పెళ్ళయిన అమ్మాయిరా... మనం అటువేపు చూడకూడదు.....'అన్న పెద్ద భావన అన్నీ కనుమరుగైపోయాయి.

ఎందుకిలా? చాలామంది ఆలోచనలోనైనా నిజాయితీలేకుండా, ముందే రకరకాలుగా లొంగిపోయి, ఎవరిని వారు దాచేసుకుంటూ... మనసులో ఒకటి... బైటికి మరొకటి... డ్రెస్‌చేసుకున్న అబద్ధంలా... అదే సరైన జీవితంలా... ఏమిటీ మార్పు... ఓ పద్ధతీ, ఓ తీరు... ఇది అనుసరించగలిగితే చక్కటి జీవితం వుంటుందన్న సాధారణ నమ్మకం ఏమైపోయింది. సుబ్బా ఇంతకన్నా ఏం చెయ్యలేదు. సుజాత శాంతించదు. వీళ్ళని భరించలేక, వదలలేక ఎన్నాళ్ళిలా? ఈ స్థితి నాకేనా, మాకేనా... మా వరకే పరిమితమైన జటిలత్వం కాదది. విలువలు మారుతూ వుంటాయని తెలీకకాదు. కొత్త విలువలేంటో తెలీని సందిగ్ధం.

ఎవరి గురించి వారికే సరిగ్గా తెలియటంలేదు. తెలిసినా, మనస్ఫూర్తిగా ఒప్పుకోవటానికి అయిష్టతే ఎక్కువగా వుంది. అలాంటప్పుడు ఎంతటి దగ్గరి వారి గురించేనా ఊరికే బాధపడి చెయ్యగలిగిందేముంది. అయితే ఇలా బాధతో ఆగిపోవటమేనా?

కళ్ళముందు సుజాతే కదులుతోంది. ఆ రోజుల్లో సుజాత ఎంత హాయిగానవ్వేది. కోపంలేని సెలయేరులా తనలో ఎంతటి అందం, ఉత్సాహం. సుబ్బా ఎంత అమాయకంగా వుండేవాడు. వీళ్ళిద్దరూ నా జీవితంలో చెరోవేపు, ఎంత నిండుగా వుండేది.

మనసులోని కష్టం, సుఖం చెప్పుకోవటానికి అందరికీ ఎవరో ఒకరు దగ్గరవాళ్ళు వుండేవాళ్ళు. వాళ్ళ చేరువలో అరమరికలు, సందేహాలు లేని ఆ సమయం అసలైన హాయిలా,నిజమైన జీవితంలాఎంత బావుండేది. ఇప్పుడు అంత నిష్కల్మషంగా ఎవరేనా వుంటున్నారా? అలా ఏకమనస్కుల్లా నలుగురూ కలవటం ఎంత తగ్గిపోయింది ?

అప్పుడు అలా వుండగలిగిన జీవనశక్తి... మసిబారినా ఇప్పుడూ వుంది... ఆగిపోనక్ఖరలేదు.

కదిలినట్టు కంటికి కనబడకపోవచ్చేమో కానీ, ఏదీ ఆగిపోదు. దేనికీ నాశనం లేదు. ఎవరూ ఆగిపోరు. నీతి, అవినీతి అన్నీ కదలికలే. పైకి మాట్లాడేదేకాదు... లోలోపల మనందరిలో మనుషుల భాష ఒకటివుంది. ఆ భాషలో అబద్ధం కుదరదు.

మా ముగ్గురిలో అబద్ధం అనేది లేదు. ఒకరినుంచి మరొకరం రహస్యంగా దాచుకుంటున్నదేంలేదు. ఎవరినీ నొప్పించకూడదన్న ఇంగితం మనసు మరిచిపోలేదు. కలిసే వుండాలన్న కాంక్ష చాలదా...

ఈ సమస్యకి మేజిక్ పరిష్కారం లేకపోవచ్చు. ఏ దారీ కనబడని జడత్వంలోనూ అడుగులుపడతాయి. దారితానంతట అదే ఏర్పడుతుంది.

ఆ దారిలో ధైర్యంగా ఒకరో ఇద్దరో నడుస్తుంటే, రాబోయే కాలంలో క్రమేపి అదే రహదారి. సుజాత, సుబ్బూ వస్తున్నారు. ప్రేమ, కోపం, పట్టుదల వాటంతట అవే నడుస్తాయి... నడవనీ...

– స్వాతి మాస పత్రిక, సెప్టెంబరు 2004